# బీచ్ ఒడ్డు

రామారావు ఆఫీసుకు వస్తూనే హుషారుగా తన పని చేసుకోసాగాడు. అందమైన టైప్ మిషన్‌పై అతని వ్రేళ్ళు ఆనందంగా నర్తిస్తున్నాయ్. " ఏమిటోయ్ గురుడివ్వేళ మంచి మూడ్ మీదున్నాడు.". ఎదురు సీట్లో కూర్చున్న జగపతి పక్కసీటు పాపారావుతో నవ్వుతూ అన్నాడు. "అతనికేమోయ్. ఇవ్వాళ నువ్ కొత్తగా అంటున్నావ్ కాని ఎప్పుడు ఆనందరాముడేగా" అంటూ పాపరావ్ తనూ ఓ చిరునవ్వు విసిరాడు.

ముఖ మీ్మద చిరునవ్వు చెదరటం, కళావిహీనమైన వదనంతో కనిపించటం రామారావు జీవితంలోనే లేదు. పెద్దగా ప్రమోషన్లు రాకపోయినా, ఎదుగూబొదుగూ లేని ఉద్యోగమే అయినా అతనెప్పుడూ అసంతృప్తికి లోనుకాలేదు. పాతికేళ్ళుగా టైపిస్ట్‌గానే స్థిరపడిపోయినా నిండైన తృప్తి, శాంతి అనుభవిస్తూ ఉంటాడు. సుఖసంతోషాలు కొందరి ముఖాన, బాదరబందీలు మరికొందరి ముఖానా రాసి పెడతాడేమో భగవంతుడు. ఇతని బ్రతుకులో అంతా ఆనందమే రాసి పెట్టాడు అని రామారావును చూసి ఈర్షపడే వాళ్ళు కొందరు. " అసలు అతని బ్రతుకులో బాధల నీడలు ముసరనే లేదా? ఏ తుఫానులూ రేగనే లేదా?" రామారావు జీవిపు లోతుల్లోకి తొంగి చూడాలనే కుతూహలం మరికొందరిది.

అందర్నీ ఒకే మోస్తరు చిద్విలాసంతో పలకరిస్తూ హాయిగా ఏవేవో కబుర్లు చెప్తూ గడిపేస్తాడు రామారావు.

అలా అతను పనిలో లీనమైన గంటకి "సార్... మిమమ్మల్ని అయ్యగారు పిలుస్తున్నారు" రామారావుతో చెప్పి వెళ్ళాడు ఆఫీసు ప్యూను.

రామారావు అప్పటికే రడీ చేసిన ఫైల్స్ పట్టుకొని ఆఫీసర్ రూమ్‌కి వెళ్ళాడు. ఫైల్స్ టేబుల్‌పైన పెట్టి వినయంగా నమస్కరించాడు.

"కూర్చోవోయ్" తనెదురుగా ఉన్న కుర్చీ చూపించాడు మాధవరావ్.

"ఫరవాలేదు సార్"

"ఇన్నాళ్ళయినా ఇంకా మొహమాటమేమిటోయ్. కూర్చో. నువ్ నిలబడితే నాకేమిటోగా ఉంటుంది."

రామారావు కూర్చున్నాడు.

మాధవరావ్ అతని ముఖంలోకి తేరిపారా చూశాడు. అతనికి రామారావ్ పట్ల ప్రత్యేకమైన అభిమా... అతన్ని చూస్తే ఎంతో హాయిగా అనిపిస్తుంది. అతను తనకింద ఉద్యోగే అయినా అతనిపైన తను అధికారి అని గుర్తురాదు. బ్రతుకు బండిని బరువుగా ఈడుస్తున్నట్టు కనిపించే జనాల మధ్య రామారావు లాంటి జీవులు అరుదేమో అనుకుంటూ ఉంటాడు. ఫోన్ మ్రోగడంతో మాధవరావ్ అందుకో బోయాడు.

"మీరాగండి సార్. ఎందుకు శ్రమ. నేను రిసీవ్ చేసుకుంటాను" అంటూ రిసీవర్ చేతిలోకి తీసుకొని "హాలో" అన్నాడు.

అవతలి కంఠంలో కోపం, కాఠిన్యం మేళవించి ధ్వనించాయి.

" ఆ మాట్లాడేది మాధవరావ్ గారేనా. ఇలా ఎంతకాలం ఊరుకుంటాం సార్. మా వ్యాపారాలు మేం ఏంకావాలి? "ఫోన్ మాధవరావ్ గారికి ఇస్తాను. మాట్లాడేదాయనకాదు". అంటున్నా వినిపించుకోకుండా తన ధోరణి కొనసాగించాడా వర్తక మహాశయుడు.

"మూడు పట్టుచీరలు ముచ్చటగా తీసుకొని ఏడాదైంది. నెలకొక చీరకు చొప్పున మూడు నెలల్లోనే బాకీ తీర్చేస్తాం అన్నారు. ఇదేం అన్యాయమండి. అంత తీర్చలేనివాళ్ళు ఎందుకు తీసుకోవాలి." రామారావు అయోమయంలో పడ్డాడు. రిసీవర్‌ని మాధవరావు కందించాడు.

షాపు యజమాని దండకం వల్లించడం మాధవరావు చెవిలో ప్రారంభమైంది.

"ఇంటికబురు పెడితే అమ్మగారెగిరి పడతారు. మా వాళ్ళు నిదానంగా ఉంటే ఏవో తీపికబుర్లు చెప్పి రేపురా మాపురా అంటారు. ఇలా ఇంటి చుట్టూ తిప్పిచ్చుకుంటారేంటి సార్. బదులు తీర్చమని గదమాయి ఇస్తే ముష్టి మూడు చీరల కోసం లంఖించికుంటారు. ఇక లాభంలేదండి." మాధవ్‌రావ్ అవమానంతో తలదించుకున్నాడు. ఛ...ఛ.... రామారావు చెవిలో ఇలాగే ఏదో నసపెట్టి ఉంటాడు అనుకున్నాడు.

"ఆగవయ్యా... ఎవరిమీద కోపం అడ్డమైన వేళల్లో ఆఫీసుకు ఫోన్ చేయడం నీకేం

మర్యాద. మాట్లాతున్నది ఎవరో కూడా తెలుసుకోకుండా నీ గొడవ మొదలు పెడతావా." అంటూ ఫోన్ పెట్టేయ్‌బోయాడు.

"మాకోపం ఎవరిమీదసార్. అరువులివ్వటం, మీ చేత మాటలనిపించుకోవటం. మా వ్యాపారం మీదేనే నాకు కోపం సార్" అంటూ మాధవరావ్ చెవి మరోసారి గింగురు మనిపించాడు.

"సరే ఫోన్ పెట్టేవయ్యబాబు. సాయంత్రం నీ షాపు కొచ్చిమాట్లాడతాను" విసుగ్గా రిసీవర్ పెట్టేశాడు.అనుకొని విధంగా తలవేడెక్కి పోవడంతో రామారావుని తానెందుకు పిలిపించింది మర్చిపోయాడు.

ఇంట్లో గొడవ ఇక్కడ కూడా ప్రత్యక్షమైంది. అంతా ఖర్మ అయినా శాంతకీ, అమ్మాయిలకే బుద్ధీ జ్ఞానం లేదు. వాళ్ళసలు మనుషులే కాదు. ఇంతోటి శాంత అక్క కూతురు పెళ్ళికి కొత్త చీరలూ, పట్టుచీరలు కావలసివచ్చాయి. తనెంత మొత్తుకున్నాడు. లక్ష్యపెట్టారా. " మీకేంతెలుస్తుంది. ఆడవాళ్ళ అచ్చటా ముచ్చటా" అంటూ అరువు తీసుకొని మరీ అలంకరించుకున్నారు.

ఏవిటో తను ఎవరినీ దేనినీ అదుపాజ్ఞలో పెట్టలేక పోతున్నాడు. తనేవైన అనబోయినా వాళ్లకి తన ఖర్చులేకనిపిస్తాయ్.

రామారావ్ మాధవరావ్ పరిస్థితి గమనించాడు. తన సంగతి షాపు యజమాని ద్వారా తెలిసిపోయినందుకు అవమానపడుతున్నాడని అర్థమైంది. ఎవరికైనా అలానే ఉంటుంది మరి. గుట్టు మట్లు తెలియకూడదని, మేడిపండు మేలిమిగా బతికేయాలనుకుంటాం. ఏం చేస్తాం. అన్నీ తెలిపిపోతాయ్ ఒక్కోసారి. మాధవరావ్ గారి పిచ్చిగాని తన దగ్గర ఎన్ని సార్లు అప్పుతీసు కోలేదాయన. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తున్నట్టు, ముఖంలో కలవరపాటు కనిపించే అతను ఏం దాచుకోగలడు. అయినా శాంతమ్మగారూ కూతుర్లూ వచ్చిన ప్రతి సినిమా చూడాలి. కొత్త చీరా, నగా ఏది ఊళ్ళో కొచ్చినా ఏదోసాకుతో కొనేసేదాకా తోచదు. సినిమాకు టిక్కెట్లు తన చేతనేగా ముందుగా తెప్పించుకుంటారు. "అలా కాసేపు మాధవరావ్ కుటుంబం గురించి ఆలోచించకుండా ఉండలేక పోయాడు రామారావ్.

మర్నాడు ఆఫీసుకొస్తూనే మాధవరావ్‌గారి దగ్గరికెళ్ళాడు. తను కబురు పంపకుండానే తన దగ్గరకొచ్చిన రామారావునుచూస్తూ కాస్త కలవర పడ్డాడు.

"ఆ... రావోయ్. రా..రా...ఏవిటిలా వచ్చావ్".

"గుడ్ మార్నింగ్ సార్" అని అతని ఆహ్వానాన్ని అందుకుంటూ స్వీట్ బాక్స్ మాధవ రావ్ టేబిల్‌పైన ఉంచాడు.

ప్రశ్నార్థకంగా చూస్తున్న అతనితో

"మా బేబీకి మెడిసన్‌లో సీటొచ్చిందిసార్" అన్నాడు సంతోషంగా " వెరీగుడ్" అన్నాడు మాధవరావ్." అన్నట్టు నీకబ్బాయిలు కూడా ఉన్నారు కదా" అడిగాడు.

"అవునుసార్" మరి అమ్మాయినెందుకు మెడిసన్ చదివిస్తున్నాను అనా మీ ఆలోచన. బేబి చదువుతానందిసార్. దానికి మంచి పట్టుదల అభిరుచి ఉన్నాయ్. అందుకే నేను కాదనలేక పోయాను. దానికి చదువుమీదున్న ఆశక్తి ఇంక దేనిమీదా ఉండదు సార్." ఎంత ప్రయత్నించినా ఆ మాటలు పలికేటప్పుడు రామారావు స్వరంలో గర్వం దాగలేదు.

"మంచిదేనోయ్. వాళ్ళు చదువుకుంటానంటే మనం చదివించడమే కదా" అనేశాడు.

ఆఫీసులో అందరికీ స్వీట్స్ పంచి తన పనిలో మునిగిపోయాడు. టేబుల్‌పైన స్వీట్ బాక్సు మాధవరావ్‌ని ఆలోచనా తరంగాల్లో ముంచెత్తుతుంది. రామారావ్ ఎంత అదృష్టవంతుడు. ఇంకెవర్నీ ఇంత దృష్టం వరించదేమో. ఇదంతా భగవత్ ప్రసాదామా? లేక స్వయంకృతమా? ఏవిటో అతన్ని చూస్తూనే సంతోషం , సంతృప్తి మూర్తీ భవింనట్లుంటాడు. మాయని పున్నమి చంద్రుడిలా అతని ముఖం ఎప్పుడూ ప్రకాశవంతంగా ఉంటుంది. తనకన్నా హోదాలో తక్కువైనా తనకింది ఉద్యోగైనా అతని హుందాతనానికి చెయ్యెత్తి నమస్కరించాలనిపిస్తుంది. నిజానికి తనని ఆపదలో అప్పిచ్చి అదుకున్నాడెన్నో సార్లు. తను బదులు తీర్చలేకపోయినా ఆ విషయం మర్చిపోయినట్లే ఉంటాడు. తను ప్రస్తావించబోయినా "దానికేముంది సార్" అనేస్తాడు. తనపట్ల గౌరవమే కాక ప్రత్యేకమైన అనురాగము ఉందతనికి. అదృష్టంతో పాటు అతనిలో మంచితనం కూడా పుష్కలంగా ఉంది. ఆ తలపులతోనే ఇల్లు చేరుకున్నాడు మాధవరావ్.

తండ్రికోసం ఎదురుచూస్తున్న రోజా రామారావ్ తనూ ఆఫీసునుండి ఇంటికొచ్చేసరికి.

"నాన్నా చూడు. సినిమాకెళదామంటే అన్నయ్యలిద్దరు రాము పొమ్మంటున్నారు. నాకు మెడిసన్‌లో సీటొచ్చిందికదా! ఇవ్వాళందరం కలిసి సరదగా గడుపుదామంటే వినడంలేదు. గోముగా ఫిర్యాదుచేసింది." రోజా అలా బుంగమూతి పెట్టి గారాలు పోయినప్పుడల్లా ఉప్పొంగి పోతుందా తండ్రి మనసు. తనకు గులాబీలంటే ఎంతో ఇష్టమని కూతురికా పేరు పెట్టుకున్నాడు. తెల్లగులాబీలా సహజ సౌందర్యంతో వెలిగిపోయే రోజాకి వేరే మోజులేవీలేవు. ఆ మాటకొస్తే వైదేహీ మాత్రం ఎంత నిరడంబరంగా ఉంటుంది. ఎప్పుడూ కాటన్ చీరలే కడతావ్ అంటే ఎంత కమనీయంగా నవ్వుతుంది. ఇవైతే ఎక్కువ కాలం మన్నుతాయండీ అంటుంది. పిల్లలకీ అన్నీ వైదేహీ అలవాట్లే. ఆదివారమొస్తే చాలు రోజు అందరి బట్టలూ ముందేస్కుని కూనిరాగాలు తీస్తూ వాటి మలినాన్ని మాయం చేస్తు ఉంటుంది.

"పనిమనిషికి వేసేస్తో పోలా" అంటే దానికి పాటలోనే సమాధానమిస్తుంది" "ఇలా శుభ్రపరచడం నాకెంతో ఇష్టం" అంటూ! దానికి సంతోషమొస్తే చాలు ప్రతిమాటకీ స్వరం కట్టి

మరి వదులుతూ ఉంటుంది. ఇవ్వాళ తన చిన్నారి రోజా ఎంత హుషారుగా ఉంది. నిజంగా విచ్చుకున్న రోజాలానే నిండుగా కనిపిస్తుంది. ఎదురుగా ఉన్న కూతుర్ని తదేకంగా చేస్తున్నాడు.

"ఏం నాన్నా! నువ్వు అన్నయ్యల పక్షమేనా. పొన్లేండీ" రోజా మరింత గోముగా అంది.

"లేదమ్మా...లేదు. అంతానా పక్షమే వెళ్తున్నాంగా ఇప్పుడు "ఆనందంగా అన్నాడు.

వైదేహి పిలుపుతో అంతా వంటింట్లోకి వెళ్ళి పాయసం తాగారు. రామారావు జీవితంలో ఇలాంటి మధురమైన రోజులెన్నో. అందరూ సినిమాకు బయలుదేరారు. థియేటర్ దగ్గర మాధవరావ్ కుటుంబాన్ని చూసి మరింత పొంగిపోయాడు రామారావు.

"వైదేహీ..శాంతమ్మగారి పక్కన కూర్చో. బావుండదు" అన్నాడు మెల్లగా.

"అమ్మకు చెప్పావు సరిపోయింది. నాకు మాత్రం రాణక్క పక్కన కూర్చోమని చెప్పొద్దు."

"ఏమ్మా"

"వాళ్ళన్నీ కొనుక్కుతింటారు నాన్న. హాలులో నాకేమో సిగ్గుగా ఉంటుంది." రాణీ వాళ్ళతో ఎక్కువగా మాట్లాడుకుండానే తుర్రుమంది రోజా. రామారావు కుటుంబం ఎదురయ్యే సరికీ మాధవరావుకీ ఆనందం కలిగింది. అతని భార్యా కూతురు కూడా సింపుల్‌గా ఉన్నారని ఏ అలంకారాలూ లేవు. అసలు సినిమాలపైన కూడా పెద్దగా ఇంట్రెస్ట్ లేదంటాడు రామారావు. ఈ రోజు సరదాగా వచ్చినట్టున్నారు. కూతురికి మెడిసన్‌లో సీటొచ్చిందిగా.

రామారావుతో తనని పోల్చుకోవాలంటే తనపైన తనకే అసహ్యం కలుగుతోంది మాధవరావుకి. అతనికంటే తనకు రాబడీ ఎక్కువ. కాస్తో కూస్తో ఆస్తిపాస్తులూ ఉన్నాయి. కానీ కళలు తరిగే చంద్రునిలా వెలవెలబోతాడే. ప్రతినిత్యం ఏదో సమస్యే. నానాటికీ తన జీవన స్థితి దిగజారిపోతుంది. ఈ ఆలోచనలతో మాధవరావు సినిమా చూడనే లేదు. ఇంటికి వచ్చినా అతని ఆలోచనలు వదలి పెట్టలేదు.

"ఏవిటిండి" ఆ రామారావు భార్యకు మరీ అంత గర్వం. కాస్తసందు దొరికితే చాలు సొంత డబ్బా మొదలుపెడుతుంది."

" నీకంత విసుగు కలిగించిన మోతేంటే" చిరాగ్గానే అన్నాడు.

"ఏంటంటే ఏం చెప్పను. కూరలన్నీ పెరట్లోనే పండిస్తుందట. ఏ రోజు కారోజు తాజాకూరలతోనే వండుకుంటారట. ఎప్పుడూ పువ్వులు కొనుక్కుని పెట్టుకోరట. ఇలా ఉన్నని.

అబ్బబ్బ పనిమనిషిల పనికూడా తానూ కూతురు చేసుకుంటామని గొప్పగా చెప్తోంది. వెధవ గొప్పలు."

మాధవరావుకి జీవిత సత్యమేదో గోచరించినట్టనిపించింది.

"నీకవి గొప్పలనిపించాయా. ఆశ్రమలో వాళ్ళెంత శాంతి ననుభవిస్తున్నారో అర్థంకాలేదా నీకు! అలా చేయబట్టే ఆ రామారావు"

"చాల్చాలు.. ఇక ఊరుకోండి. మీరూ మొదలట్టేట్టున్నారు. మీ కింద పనిచేస్తున్నవాడతను."

"లేదు శాంతా. రామారావే పైనున్నాడు. నేను అవివేకంతో చాలా కిందనే ఉండిపోయాను. "మాటలు అతని పెదవినిదాట రాలేదు. వేడి నిట్టూర్పు మాత్రం వదలి ఊరుకున్నాడు. మర్నాడు కూతుళ్ళు రామారావు కుటుంబాన్ని కామెంట్ చేశారు. "ఏమిటి నాన్నా. సినిమాలకి షికార్లకి వచ్చేటప్పుడు కూడా వాళ్ళా ముతక చీరలే కట్టుకోవాలా పైగా గర్వం ఒకటి. రోజంతా ఏదో ఒక పని చేస్తే గాని తోచదట. కాలేజికెళ్ళి చదువుకునే వాళ్ళు బట్టలుతుక్కుంటూ, తోటపని చేసేకోవటమా. ఉత్తబోరు!! ఇంకా మాధవరావు ఆఫీసుకు వెళ్ళేదాకా ఏదోటీ చెప్తూనే ఉన్నారు. అతను ఊరుకోలేకపోయాడు.

"అందుకే తను సంపాదించే దాంట్లో సగం వెనకేసుకోగలుతున్నాడయ్యా. మా రామారావు పిల్లల్ని ఎంత చదివించినా విదేశాలు పంపినా కూడా మనలా అప్పులు చేయవలసిరాదు" కూతుళ్ళ ముఖంలోకి తీక్షణంగా చూస్తూ అనేసి బయటకెళ్ళిపోయాడు.

ఆఫీసులో పని కాగానే ఇంటికెళ్ళబుద్ధి పుట్టలేదు. బీచ్‌వైపు నడిచాడు.

"గుడీవినింగ్ సార్" అంటూ అక్కడా ఎదురయ్యాడు రామారావు. ఇద్దరూ బీచ్ వద్దున కూర్చున్నారు. చల్లని సాయంకాలం. నీళ్ళువచ్చి ఇద్దరి పాదాలనూ తాకివెళుతున్నాయి. రాత్రి నుంచి రామారావు గురించే ఆలోచిస్తున్న మాధవరావ్ అప్రయత్నంగా అతనికి షేక్‌హాండ్ ఇచ్చి చేతులు పట్టుకుని ఊపేశాడు.

రామారావు విస్తుపోయాడు.

మాధవరావన్నాడు. "నువ్ హాయిగా బీచ్ వద్దున కూర్చున్నావోయ్." రామారావు కేమీ అర్థంకాలేదు. మాటల్లో బోధపడని మాధవరావుగారి భావాలు ముఖంలో పసికట్టగలనేమో అని చూడసాగాడు రామారావు.

"అవునోయ్  అలా వింతగా చూడకు. నువ్వులోతులు తెలిసిన ఈతగాడివి" అతనికి

మరింత దగ్గరగా జరిగి భుజాల మీద చేతులు వేశాడు. "...చండి సార్. ఇవ్వాళ మీరేం మాట్లాడుతున్నారో అంతుపట్టడం లేదు." అతని చేతుల్ని తొలగిస్తూ అన్నాడు.

"ఏమోయ్. నీకు నా మాటలు అర్థం కావడం లేదా."

"ఎంత మాటసార్. మీరింత సన్నిహితంగా ఉంటే నాకే ఏదో బిడియంగా ఉంది. మీధోరణి అర్థం చేసుకోలేక పోతున్నందుకు మీరే నన్ను మన్నించాలి సార్"

"ఏముందోయ్. నాలోని గొప్పతనం ఏముంది? నీకు పై అధికారిని. అంతేగా. నిజానికి నీలోనే ఎంతో గొప్పతనముంది. చూడు మిత్రమా సంసారం ఒక సాగరం అంటారు. దాన్ని ఈది ఆనందపు బీచ్‌వద్దకు చేరుకున్నావ్. నువ్ ధన్యుడివి సంతానంలో అదుపు సంసారంలో పొదుపరితనానికి విలువ ఇవ్వలేక నేనూ దర్జాలు వెలిగించే నాబోటి వాళ్ళూ ఈ బీచ్ వద్దన కూర్చున్నా సాగరపు లోతులు చూస్తూ భయపడవలసిందే."

మాధవరావు మాటల్లోని యదార్థాన్ని గుర్తించిన రామారావు కళ్ళు మెరిసాయి.

"నేను మీకు చెప్పదగ్గ వాణ్ణి కాదుగానీ.. సార్ ఇంత సన్నిహితంగా ఉన్నారు కనక ఒక్కమాట చెప్పమంటారా." అతను మాట్లాడ్డమేవరంలాతోచింది మాధవరావుకి

"మీరు అర్థం చేసుకున్న ఈ విషయాన్ని మీ కుటుంబ సభ్యులకి బోధపరచండి. అమలు జరిపేదాకా పట్టువదలకండి. అంతే అప్పుడిక ఈ అలల పొంగులు మనల్ని భయపెట్టవు. పొదుపును మించిన పెన్నిధి లేదనే సూత్రం ఒక్కటి తెలుసుకుంటే మీరు కూడా ప్రశాంతంగా ఈ బీచ్ వద్దన కూర్చోవచ్చు. అవలీలగా సంసార సాగరపులోతుల్ని ఈదేస్తారు. మీరూ గజ ఈత గాడైపోతారు మాధవరావుగారు." ప్రాణ స్నేహితుడన్న భావనతో అతని చుట్టూ చేయి వేశాడు రామారావు.

రామారావుని అప్యాయంగా కౌగిలించుకున్నాడు మాధవరావు.

*09-07 -2003 ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం నుంచి ప్రసారం* ❑